ఆహ్లాదం పంచుతున్న రాక్ గార్డెన్ పార్కు

● సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు

అల్లాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవన శైలిలో మానవాళికి అన్ని రకాలు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో లైఫ్‌స్టైల్ తెచ్చిపెట్టే ముప్పుపై ఇప్పుడిప్పుడే అవగాహన పొందుతున్నారు. పొద్దంతా కుర్చీలో కూర్చుని ఉద్యోగాలు చేసుకునేవారికి మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు వీలుగా కాల నీల నడుమ ఓ పార్కు ఉంటే బాగుంటుందని అనిపిస్తుంది. అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రీనగర్, రాధాకృష్ణ సొసైటీల్లోని పార్కులు, ఇండోర్ స్టేడియంలలో ఒత్తిడి తగ్గించుకునే అవకాశం ఉంది. 30 కాలనీలు ఉన్న అల్లాపూర్ డివిజన్‌కు కేవలం ఈ రెండు కాలనీలల్లోనే పార్కులు, ఇండోర్ స్టేడియంలు ఉన్నాయి.

ప్రత్యేకించి గాయత్రీనగర్‌లోని 'రాక్ గార్డెన్' పార్కు పేరుకు తగ్గట్టుగానే పెద్ద పెద్ద శిలలతో ఇమిడి ఉన్న ఈ ప్రాంతాన్ని ఓ అందమైన నందన వనంలా తయారు చేసి, మార్నింగ్ వాకర్స్‌కు సీనియర్ సిటిజన్స్, మహిళలు, చిన్నారులు.. ఇలా అన్ని వయస్సులవారికి ఆహ్లాదాన్ని పంచిపెడుతుంది ఈ ఉద్యానవనం.



సున్నం చెరువు సమీపంలోని రాక్ గార్డెన్ పార్కులో వ్యాయామం చేస్తున్న యువత



పార్కులో వాకింగ్ చేస్తున్న ప్రజలు, పచ్చదనం పంచుతున్న మర్రి చెట్టు

చిన్నారులకు టైంపాస్

గత ఏడాది రాక్ గార్డెన్ పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు 'టాట్-లాట్'ను ఏర్పాటు చేశారు. ఓ పక్క తలిదండ్రులు ఓపెన్-జిమ్‌లో వ్యాయామం చేసుకుంటుండగా వారి పిల్లలకు ఊయలలు, జారుడు బండ(స్లైడ్) వంటి ఆట వస్తువులుండటంతో పెద్దలతో పాటు చిన్నారులు కూడా రాక్ గార్డెన్ పార్కుకు వచ్చేందుకు ఇష్టపడతారు.



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన టాట్-లాట్

ఆహ్లాదపరిచే పచ్చదనం

జీవవైవిధ్యం ప్రతిబింబించేది 'ఫ్లోరా-ఫానా'లతో. ఇక రాక్ గార్డెన్ పార్కులో మరో ప్రత్యేకం ఇక్కడి ఫ్లోరా, అనేక రకాల చెట్లు ఈ పార్కులో ఉండగా ప్రత్యేకించి మర్రి, రావిచెట్టు ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ రాష్ట్ర చెట్టు జమ్మి చెట్టు కూడా ఈ పార్కులో ఉండటం విశేషం.

ఆకట్టుకునేలా జీవవైవిధ్యం

గాయత్రీనగర్‌లోని రాక్ గార్డెన్ పార్కుకు మరో ప్రత్యేకత పలు రకాల పక్షులు. ఊర పిచ్చుకలు మొదలు, కోయిల, కాకులే కాకుండా రామచిలుకలకు నెలవు ఈ పార్కు ఉంది. సున్నం చెరువుకు ఆనుకుని ఉన్న ఈ ఉద్యానవనంలో నిత్యం పక్షుల కిలకిలారావాలు వాకర్స్‌ను అలరిస్తాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువ వస్తారు



'రాక్ గార్డెన్' పార్కుకు నేను 8 ఏళ్లుగా వస్తున్నా. నాటినుంచి నేటికి ఇక్కడి పరిసరాల్లో జనం 5 రెట్లు అధికమయ్యారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా నివసించే ఈ కాలనీలో ఉద్యోగ రీత్యాఉంటే స్ట్రెస్‌ను రిలీఫ్ చేసుకునేందుకు వస్తారు. పెద్దలు పిల్లలు అందరూ వస్తారు.

-కందనూరు సూరిబాబు, అధ్యక్షుడు, సీనియర్ సిటిజన్స్ ఫోరం

పార్కును బాగా తీర్చిదిద్దారు



నేను 3 ఏళ్లుగా ఈ పార్కుకు వస్తున్నా, మా అమ్మ కూడా ఇక్కడ వాకింగ్ చేస్తారు. పార్కును ఇంత ఆహ్లాదంగా, ఇంతందంగా తీర్చిదిద్దిన మునిసిపల్ అధికారులకు కృతజ్ఞతలు.

-సతీష్, ఇంటీరియర్ డిజైనర్



డా.విజయ్ పండరిపాండే చేతుల మీదుగా ఎంబీబీఎస్ పట్టా అందుకుంటున్న దశ సాహితి తమ్మారెడ్డి

ఘనంగా ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల స్నాతకోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ 4వ స్నాతకోత్సవం శుక్రవారం కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. 2019-20లో ఎంబీబీఎస్‌లో చేరి కోర్సు పూర్తి చేసుకున్న 100 మంది విద్యార్థులకు మాజీ వీసీ డా.విజయ్ పండరిపాండే, కల్నల్ సచిన్ నింబాల్కర్ కాన్వకేషన్ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచనతో మీరంతా ఎంబీబీఎస్ పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉన్నత చదువులు అభ్యసించి వైద్య రంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సౌత్ జోన్ మెడికల్ కమిషనర్ సునితా చోప్రా, ఈఎస్ఐసీ రీజనల్ డైరెక్టర్ రాజీవ్ లాల్, డీన్ శిరీష్ కుమార్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-2లోని రేషన్ షాపులో తనిఖీ చేస్తున్న ఏసీఎస్‌వో కల్యాణ్, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు

రేషన్ షాపుల్లో ఏసీఎస్‌వో ఆకస్మిక తనిఖీలు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని బాలానగర్ సర్కిల్ ఏసీఎస్‌వో (అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్) కల్యాణ్ అన్నారు. చెకింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శుక్రవారం కేపీహెచ్‌బీలోని రోడ్డు నంబర్-2, 3లోని రేషన్ దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. సన్న బియ్యం లబ్ధిదారులు తీసుకుంటున్నారా? పక్కదారి పడుతున్నాయా అనే విషయంపై ఆరా తీశారు. వచ్చిన ఇండెంట్ ఎంత? ఎంత మంది తీసుకున్నారు అనే విషయాలపై రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చే సన్న బియ్యం, ఇతర ఉత్పత్తులు ఏమైనా సరే లబ్ధిదారులు తీసుకోకుంటే నేరుగా లెక్కచెప్పాలిందే. ఎవరైనా తీసుకోకుండా వాటిని బయట అమ్ముకున్నట్లు తెలిసినా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ లక్ష్యం పేద ప్రజలు ఆర్థికంగా భారం పడకుండా ఉండేందుకు సన్న బియ్యం ఇస్తుందని, ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న మాధవరం కాంతారావు

విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. శుక్రవారం మధుకర్ సేవా సమితి తరపున సర్వ పవన్ ఆహ్వానం మేరకు కేపీహెచ్‌బీ మూడోఫేజ్ భువనవిజయం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కాంతారావు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా పేద విద్యార్థుల చదువుకు తోడ్పాటును అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు తోట రమేష్, బసవోజు రేవతి, శ్రీనివాస్‌రెడ్డి, వినోద్ కుమార్ గౌడ్, గోపీ కృష్ణ, సూరి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సఫ్దర్‌నగర్ నాలా వద్ద అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబీహ బేగం

వానాకాలంలోగా నాలా పనులు పూర్తి

● కార్పొరేటర్ సబీహ బేగం

అల్లాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్ నగర్ ప్రాంతంలో కార్పొరేటర్ సబీహ బేగం ఎస్ఎన్‌డీపీ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. సఫ్దర్ నగర్‌లో నుంచి పారే నాలాను, దాని నిర్మాణ పనులను కార్పొరేటర్‌తో సహా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సబీహ గౌసుద్దీన్ మాట్లాడుతూ వాతావరణ శాఖ అంచనాల మేరకు నగరంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. వచ్చే వానా కాలంలోపు నాలా పనులు ఓ కొలిక్కి వచ్చేలా ప్రణాళిక రచించాలని కూడా ఆమె కోరారు. కార్యక్రమంలో ఈఈ రమేశ్, ఏఈలు శంకర్, రంజిత్, సఫ్దర్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, సయద్ రియాజ్, అస్లం బేగ్, మల్లేశ్, రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్



విద్యార్థినికి సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఇస్తున్న వైద్య సిబ్బంది

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాందేవ్‌రావు హాస్పిటల్, కార్నర్ స్టోన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సంయుక్తంగా శుక్రవారం రిక్షాపుల్లార్స్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థినులకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఇచ్చారు. కార్నర్ స్టోన్ కంపెనీ రోగులు ప్రాణపాయ స్థితిలో ఉన్నవారికి కృత్రిమంగా శ్వాసను అందించే రూ.24 లక్షలు విలువ చేసే మానిటర్‌తో కలిపి వెంటిలేటర్‌ను తమ ఆస్పత్రికి విరాళంగా ఇచ్చిందని సీఈవో డా.యోబు తెలిపారు. ఈ సందర్భంగా అభిషేక్ గుప్తాను శాలువాతో సత్కరించారు.

మంజీరాకు లీకేజీలు.. నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం రాత్రి నుంచి నీటి సరఫరాలో అంతరాయం తలెత్తింది. హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లయ్ పథకం ఫేజ్-2లో భాగంగా పటాన్‌చెరు నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు ఆర్‌సీపురం, ఫాదర్‌స్కూల్, ఓల్డ్ ముంబయ్ రోడ్డులో రెండు లీకేజీలు ఏర్పడడంతో నీరంతా వృథాగా పోతోంది. దీంతో శుక్రవారం రాత్రి 11 గంటలకు పనులు ప్రారంభమవుతాయని అధికారులు ప్రకటించారు. నీటి సరఫరా నిలిపివేయడంతో పలు ప్రాంతాలకు ఎర్రగడ్డ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్, కేపీహెచ్‌బీకాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట్, జగద్గిరిగుట్ట, ఆర్సీపురం, అశోక్ నగర్, జ్యోతీనగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, దీప్తిశ్రీనగర్, బీరంగూడ, అమీన్ పూర్, నిజాంపేట్‌లతో పాటు పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో వారం రోజుల పాటు ఇబ్బందులు తలెత్తనున్నాయి.



● ఆకట్టుకున్న సీతారాముల విగ్రహాలు

సీతారాముల కల్యాణానికి రాజస్థానీ కళాకారులు సీతారాములు, ఆంజనేయ స్వామి విగ్రహాలను తయారు చేసి అమ్మకానికి పెట్టారు. కళాకారులు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో విగ్రహాలను తయారు చేసి వాటికి జీవం ఉట్టి పడేలా రంగులు అద్ది రోడ్డు పక్కన అమ్మకానికి పెట్టారు. మియాపూర్, కేపీహెచ్‌బీ కాలనీ, షాపూర్‌నగర్, ఓల్డుబోయినపల్లి ప్రాంతాలలో ఈ విగ్రహాల అమ్మకాలు జరుగుతున్నాయి.

-బాలానగర్, ఆంధ్రజ్యోతి



నాగార్జున కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

నాగార్జున కాలనీలో కార్పొరేటర్ పర్యటన

ఫతేనగర్; ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ నాగార్జున కాలనీలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ శుక్రవారం పర్యటించారు. బస్తీలో తాగు నీటి సమస్య ఉన్నట్లు స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఆయన కలుషిత నీరు, లో ప్రెషర్ సమస్యలు ఉన్న ఇళ్లకు వెళ్లి సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకుడు నసీర్, రెహన్ ఖాన్, ఖలీం, అస్లామ్‌గౌస్, జగన్, సతీష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

చెడు అలవాట్లకు విద్యార్థులు బానిసలు కావొద్దు

బాలానగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బాలానగర్‌కు చెందిన అప్సా, అక్షోనేబుల్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చెడు అలవాట్లకు బానిసలు కావొద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మడ్‌ఫోర్డు ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సిగరేట్ స్మోకింగ్, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలైతే వారి భవిష్యత్తు ఎలా ఉంటుందో వివరించారు. కార్యక్రమానికి ఖార్థాన ఏసీపీ జి.సతీష్ ముఖ్య అతిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అప్స, అక్షోనేబుల్ సంస్థ మేనేజర్ బస్వరాజ్, పరివర్తన్ మేనేజర్ బుగ్గయ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.



● ట్రాఫిక్ జాంలో అంబులెన్స్

కేపీహెచ్‌బీలో వారాహి సిల్క్స్ షోరూం ప్రారంభోత్సవంలో సినీ నటుడు నందమూరి బాలకృష్ణ, సినీనటి మీనాక్షి చౌదరి రావడంతో భారీగా ట్రాఫిక్ జాం అయింది. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంతో సాధారణ వాహనదారులతో పాటు అంబులెన్స్‌కు కూడా తిప్పలు తప్పలేదు. సుమారు రెండు గంటల పాటు ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

- కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి

బీఆర్ఎస్ రజతోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్ సమీపంలో ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లతో కలిసి నిర్వహించిన సమావేశానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టి 25 ఏళ్ల అయిన సందర్భంగా సుమారు 1500 ఎకరాల సువిశాల స్థలంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశం విజయవంత చేయడంతో పాటు గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ మరింత బలోపేతం చేయాలని సూచించినట్లు తెలిపారు. సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, పలువురు హాజరయ్యారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



పార్టీ కార్యాలయంలో లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్న బండి రమేష్

బాలానగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల కష్టాలన్ని దూరం అవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మూసాపేటకు చెందిన నర్సింహ చారి(రూ.60,000), బాలానగర్‌కు చెందిన సరోజ (రూ. 39,000), అల్లాపూర్‌కు చెందిన రైనీ భూలక్ష్మి(రూ.42,500)లకు సీఎం రిలీఫ్ ఫండ్‌నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం ఉదయం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో వారికి అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కారు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ఏదో రకంగా కాంగ్రెస్ పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పమ్మ, నాగిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, వేణు, దండుగుల యాదగిరి, రాఘవేందర్, రమేష్, మధూగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

జీడిమెట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్టలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన కాంపౌండ్‌ను మండల రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. సర్వే నంబర్ 348/1లో గల అనాథాశ్రమం స్థలం సమీపంలో ఓ కబ్జాదారుడు రాత్రికి రాత్రే గది నిర్మించి కాంపౌండ్ వాల్ నిర్మించాడు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీమ్‌కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని ఆర్ఐ హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ వసంతనగర్ సెక్షన్ పరిధిలో సమ్మర్ యాక్షన్‌లో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వాణి ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గోకుల్ ప్లాట్స్, వెంకటరమణ కాలనీ, సాయిహిల్స్ ప్రజయ్ మెగాపోలీస్, గోపాల్‌నగర్, సాయినగర్, సర్దార్‌పటేల్‌నగర్, వసతంనగర్, ధర్మారెడ్డి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అల్లాపూర్ డివిజన్‌లో

అల్లాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాకేష్ గౌడ్ తెలిపారు. 11 కేవీ హ్యూండాయ్-2 ఫీడర్ ఎమనేటింగ్ నుంచి 33జ11 కేవీ ఎస్ఐఎ ఎస్ఎస్ పరిధిలోని మెరిడియన్ స్కూల్ పరిసరాలు, ఎస్-కన్వెన్షన్ లేన్, నియర్ బుట్ట కన్వెన్షన్ రోడ్ నుంచి ఎస్ఐఏ వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు. అదే విధంగా 11 కేవీ ఎస్‌బీఐ కాలనీ ఫీడర్ నుంచి 33జై 11 కేవీ ఎస్ఐఏ. ఫీడర్ పరిధిలోని ఆర్.ఆర్.ఆర్. వైన్స్, ఎస్‌బిఐ కాలనీ కైత్లాపూర్ బ్రిజ్ పరిసరాలు, చందానాయక్ తండా(పార్టు) ప్రాంతాల్లో మధ్యాహ్నం 3:30 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రాకేష్ తెలిపారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు



కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోట 11, వంకాయ 18, బెండకాయ 35, పచ్చి మిర్చి 40, బజ్జి మిర్చి 23, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజీ 10, బీన్స్ 65, క్యారెట్ 18, గోబి పువ్వు 18, దొండకాయ 28, చిక్కుడు కాయ 55, గోరు చిక్కుడు 28, బీట్‌రూట్ 19, క్యాప్సికం 40, ఆలుగడ్డ 24, కీర 18, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ 18, కంద 75, ఉల్లిపొరక 28, ఉల్లిగడ్డ 24, మామిడి కాయ 15-20, అరటికాయ 8-9, చామగడ్డ 40, ముల్లంగి 4-5, చిలగడ దుంప 30, గుమ్మడి కాయ 30, నిమ్మకాయలు 60-70, మునగ కాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 95, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 50, లోబా 25, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎర్లీ బర్డ్‌కు అధికారుల సన్నాహాలు

● ఐదు శాతం డిస్కౌంట్‌పై విస్తృత ప్రచారానికి ఏర్పాట్లు
● ఆర్థిక సంవత్సరం ముగిసినా ఉద్యోగులకు ఒత్తిడి తగ్గకపాయే!
● కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్స్‌లో ప్రాపర్టీ ట్యాక్స్‌పై ప్రత్యేక దృష్టి

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బల్దియా ఖజానా నింపేందుకు కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల డీసీలు పడరాని పాట్లు పడుతున్నారు. 24-25 ఆర్థిక సంవత్సరంలో వేగం పెంచి ఆశించిన స్థాయిలో పన్ను వసూళ్ల రాబట్టారు. కనీసం వారం కూడా గడువు ఇవ్వకుండానే ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎర్లీ బర్డ్ టార్గెట్ ఇచ్చి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. శ్రీరామ నవమి తర్వాత క్షేత్రస్థాయిలో డీసీలు బండి గంగాధర్, భారతి వంశీకృష్ణ రంగంలోకి దిగనున్నారు. ఇప్పటికే సిటిజన్ సర్వీస్ సంటర్ ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఎర్లీ బర్డ్ కింద చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తూ ప్రాపర్టీ ట్యాక్స్ స్వీకరిస్తున్నారు.

జంట సర్కిళ్లలో ఇదీ పరిస్థితి..

కూకట్‌పల్లి, మూసాపేట్‌కు గత ఆర్థిక సంవత్సరం ముగియగానే ఎర్లీ బర్డ్ కింద ఏప్రిల్‌లో టార్గెట్స్ ఇచ్చారు. కూకట్‌పల్లి సర్కిల్‌కు గత ఏడాది రూ.91 కోట్లు టార్గెట్ ఇవ్వగా రూ.88 కోట్లు రాబట్టారు. అలాగే మూసాపేట్ సర్కిల్‌లో రూ.116 కోట్లు టార్గెట్ ఇవ్వగా రూ.107 వసూళ్ల చేశారు. తాజాగా ఏప్రిల్ 1-30వ తేదీ వరకు ఎర్లీ బర్డ్ కింద బల్దియా హెడ్ ఆఫీస్ నుంచి కూకట్‌పల్లికి రూ.46.69 కోట్లు, మూసాపేట్‌కు రూ.66.30 కోట్లు టార్గెట్ ఇచ్చారు. సెలవులు లేకుండా పనిచేసిన ఉద్యోగులకు తాజాగా ఇచ్చిన ఎర్లీ బర్డ్‌తో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగులు బాస్‌లకు చెప్పుకోలేక లోలోన మదనపడుతున్నారు.

అయితే డీసీలు కూడా క్షేత్రస్థాయిలో సెలవులు తీసుకోకుండా ఉదయా స్నే మార్కెట్‌లోకి వచ్చి రాత్రి వరకు పనిచేయడంతో ఇదే ఉత్సాహం ఏప్రిల్‌లో కూడా కొనసాగిస్తే అనుకున్న లక్ష్యం నెరవేరడం పెద్ద కష్టం ఏమి కాదంటున్నారు. ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి కంటి మీద కునుకులేకుండా పోయింది.

పంథా మార్చే యోచనలో డీసీలు..

జంట సర్కిళ్ల బాధ్యతలు చూస్తున్న ఇద్దరు డీసీలు కూడా గత ఆర్థిక సంవత్సరం మధ్యలో వచ్చిన వారే. దీంతో గత ఏడాది బకాయిలతో పాటు పెండింగ్ వాటిని రాబట్టి బల్దియా ఉన్నతాధికారుల నుంచి మెప్పు పొందారు. ఎర్లీ బర్డ్‌కు సమయం లేనందున ఉన్న దాంట్లో ఎక్కువ అడ్వాన్స్ పేమెంట్ చేసే మాల్స్, మల్టీప్లెక్స్ సూపర్ మార్కెట్లు, థియేటర్స్, కంపెనీల జాబితా సేకరించి నేరుగా వారిని వెళ్లి కలవనున్నారు. డీసీలు నేరుగా పెద్ద మొత్తంలో ట్యాక్స్ చెల్లించే వారిని కలిసి ఎర్లీబర్డ్ కింద వసూళ్ల చేసేందుకు ఎవరి స్థాయిలో వారు ఏప్రిల్‌లో ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల చేసేందుకు శ్రీకారం చుట్టనున్నారు.



మూసాపేట్‌లో జీహెచ్ఎంసీ కార్యాలయంలో

ఎర్లీ బర్డ్ కలెక్షన్‌లో వేగం పెంచుతాం



నేను పనిచేస్తూనే ఉద్యోగులు, సిబ్బందిని ఉరుకులు పరుగులు పెట్టించా. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో రూ.91 కోట్ల టార్గెట్‌కు గాను రూ.88 కోట్లు రాబట్టాం. 2025-26 ఎర్లీ బర్డ్‌కు ఉద్యోగుల్ని సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యాం. మూడు నెలలుగా కష్టపడ్డాం. మార్చిలో అయితే సెలవులు లేకుండా పనిచేశాం. అయినా గ్రేటర్ నుంచి మాకు ఇచ్చిన ఎర్లీ బర్డ్ టార్గెట్‌ను ఉద్యోగుల సహకారంతో పూర్తిచేస్తాం. ఉద్యోగుల కూడా అందుకు సన్నద్ధమయ్యేలా దిశానిర్దేశం చేస్తున్నాం.

- బండి గంగాధర్, డిప్యూటీ కమిషనర్, కూకట్‌పల్లి సర్కిల్


నియామక పత్రంను అందుకుంటున్న కొండవీటి సునీతాప్రభాకర్‌రెడ్డి

శేరిలింగంపల్లి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సునీత

చందానగర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా కొండవీటి సునీతాప్రభాకర్‌రెడ్డి నియామకం అయ్యారు. చందానగర్ డివిజన్ జవహర్‌కాలనీకి చెందిన సునీతాప్రభాకర్‌రెడ్డి గతంలో కౌన్సిలర్‌గా,పార్టీలో చురుకుగా వ్యవహరించడంతో ఆమెకు ఈ బాధ్యతను అప్పగించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ చేతుల మీదుగా నియమాక పత్రం అందుకున్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన నాయకులకు పేరు పేరునా ఆమె ధన్యవాదలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరిని కలుపుకోని ముందుకు వెళతానని తెలిపారు.


మక్తా చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలను కూలుస్తున్న అధికారులు

చెరువులో అక్రమ నిర్మాణాల కూల్చివేత

గచ్చిబౌలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలం.. మక్తా చెరువులోని శిఖం భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ వెంకారెడ్డి మాట్లాడుతూ, మక్తా చెరువు శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయని, వివిధ పనుల వత్తిడి వల్ల చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. గత వారంలో వరుసగా సెలవులు రావడం, హెచ్‌యూసీ భూముల విషయంలో బీజీగా ఉండడంతో ఇదే అదనుగా ఓ వ్యక్తి చెరువు శిఖం భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు తెలిసిందని వివరించారు. అక్రమ నిర్మాణాలను శుక్రవారం కూల్చివేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఆక్రమిం చి నిర్మాణాలు చేపడితే నిర్ధాక్షిణ్యంగా కూల్చివేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. అవసరం అయితే క్రిమినల్ కేసులు కూడా పెడతామని తెలిపారు.


ఆల్విన్‌కాలనీ ఫేజ్-1లో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం: దొడ్ల

హైదర్‌నగర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 డ్రైనేజీ, రోడ్లకు సంబంధించిన సమస్యలను శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు వెంకటేష్‌గౌడ్, కుమారచారి, రఘు, లక్ష్మీ, హేమలత, పోశెట్టిగౌడ్, శంకర్, జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న 'సూత్ర ఇండియన్ ఫ్యాషన్' ఎక్స్‌పో


ప్రదర్శనలో దుస్తులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వేసవిలో శుభకార్యాలు, వివాహాల కోసం చల్లదనంతో ఫ్యాషనబుల్‌గా ఉండే దుస్తులను కొనుగోలు చేసేందుకు ప్రజలు మొగ్గు చూపుతుంటారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ తాజ్ కృష్ణలో ఏర్పాటు చేసిన సూత్ర ఇండియన్ ఫ్యాషన్ ఎక్స్‌పో ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రవేశం ఉచితం అని, ప్రదర్శన ఈ నెల 5 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.


అద్దంకి దయాకర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు మన్నేపల్లి సాంబశివరావు, తదితరులు

అద్దంకి దయాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

మియాపూర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమ నేత, రాష్ట్ర శాసనమండలి సభ్యుడు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ జన్మదిన సందర్భంగా మియాపూర్ డివిజన్ నాయకులు మన్నేపల్లి సాంబశివరావు, తదితర నాయకులు శుక్రవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణగౌడ్, రామకృష్ణ, కిషోర్, పట్టాభి, సరస్వతి, మాధవరెడ్డి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హైదర్‌నగర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పాపారాయుడునగర్, సాయిబాబా కాలనీలో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5గంటల వరకు విజయనగర్, విజయనగర్‌కాలనీ, శుభోదయకాలనీ, ఆల్విన్‌కాలనీలో విద్యుత్ సరఫరాఉండదు.

- అడ్డగుట్ట ఫీడర్ పరిధిలో ఉదయం 10నుంచి 11గంటల వరకు అడ్డగుట్ట రోడ్ నెంబర్ 1నుంచి 7వరకు, ఫేజ్-11, భాగ్యనగర్, మధ్యాహ్నం 3నుంచి 3.30 గంటల వరకు వెస్ట్రన్‌హిల్స్, ఫేజ్-2, భాగ్యనగర్‌కాలనీ, అడ్డగుట్టలో విద్యుత్ సరఫరా ఉండదు.

ఏడాదిగా ఇంతే..!

- నత్తనడకన కొనసాగుతున్న పైపులైన్ల నిర్మాణం
- జాతీయ రహదారి పక్కనే అభివృద్ధి పనులు
- నిత్యం ట్రాఫిక్ జాంతో వాహన దారుల ఇక్కట్లు



బొల్లారం రోడ్డు నుండి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వరకు ప్రమాద భరితంగా పోసిన మట్టికుప్పలు

మియాపూర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే ముంబయ్ 9వ నెంబర్ జాతీయ రహదారి పక్కన నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులతో వాహన దారులకు నిత్యం నరకంగా మారుతోంది. మంజీర పైపులైను, డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణం కోసం జాతీయ రహదారి పక్కన మియాపూర్ బొల్లారం చౌరస్తా నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు పనులు ఆలస్యం అవుతుండడంతో ట్రాఫిక్ సమస్య తెచ్చిపెడుతోంది. దీంతో ప్రయాణికులకు కేవలం అరకిలోమీటర్ ప్రయాణానికి అరగంటకు పైగా సమయం పడుతుంది. అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ అలసత్వంతో అధికారులకు, కాలనీవాసులకు అవస్థలు తెచ్చిపెడుతుంది. జాతీయ రహదారి పక్కన మంజీర పైపులైను, డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణం కోసం మియాపూర్ బొల్లారం చౌరస్తా నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు చేపట్టిన పనులు ఏడాది కాలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. ఇష్టారాజ్యంగా భారీ పైపులను రోడ్లపై అడ్డదిడ్డంగా పడవేయడంతో పాటు దీనికి తోడు పైపులైన్ల కోసం తవ్విన మట్టిని ఎక్కడబడితే అక్కడ వేసి అనేక చోట్ల కాల్వలను కూడా మూయలేదు. అయితే ప్రధాన జాతీయ రహదారికి, సర్వీస్‌రోడ్ చివరికి వాణిజ్య, వ్యాపార సముదాయాలు, ఆస్పత్రులు నిత్యావసర దుకాణాలు ఉన్నాయి. ఈ కాల్వలు మూయకపోవడం, నిత్యం కాల్వల కోసం తవ్విన మట్టివల్ల కొనుగోలుదారులు జాతీయ రహదారిపైనే తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మూడు నెలల నుంచి ఐదునెలల్లో పూర్తికావాల్సిన పనులు ఏడాదినుంచి కొనసాగుతూనే ఉన్నాయి. మరోవైపు మియాపూర్ బొల్లారం చౌరస్తానుంచి బీహెచ్‌ఈఎల్ వరకు రోడ్డు ఇరుకుగా మారి నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఈ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 నిమిషాల ప్రయాణానికి 40 నిమిషాల సమయం పడుతుంది. పనులు పూర్తయిన చోట మట్టికుప్పలు తొలగించలేదు. అదనంగా ఉన్న పైపులను అక్కడ నుండి తొలగించలేదు. ఇంకోపక్క జాతీయ రహదారి పైనే వాహనాల పార్కింగ్‌తో ప్రజలు నరకయాతన పడుతున్నారు.


వృథాగా పడిఉన్న పైపులు

పనులు పూర్తిచేయాలి

ట్రాఫిక్ సమస్యకు ఇబ్బందిగా మారినా అభివృద్ధి పనులు పూర్తిచేయాలి. ఏడాదిగా జరుగుతున్న పనులతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. మట్టికుప్పలు, పైపులు వేసి తీయడం లేదు. అధికారులు స్పందించి పనుల వేగం పెంచడంతో పాటు మట్టికుప్పలు తొలగించాలి.

- వాసు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

పైపులను త్వరలో తొలగిస్తాం

అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. అడ్డుగా ఉన్న మట్టికుప్పలు, పైపులను త్వరలోనే తొలగిస్తాం.

- రామకృష్ణ, డీఈ

అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే ఆరెకపూడి


కొండాపూర్ ఉస్మానియా యూనివర్సిటీ కాలనీలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన గాంధీ, కార్పొరేటర్ అమీద్‌పటేల్

గచ్చిబౌలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్ ఓయూ కాలనీలో రూ.60.70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులకు స్థానిక కార్పొరేటర్ శేఖ్ అమీద్‌పటేల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నగరంలోనే శేరిలింగంపల్లి అభివృద్ధిలో ముందు వరసలో నిలిపేందుకు నిరంతరం కృషిచేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఏ ఇబ్బందులు వచ్చినా, తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో దాదాపు అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు వేయడం జరిగిందని ఇంకా ఎక్కడైనా మిగిలిపోయి ఉంటే వెంటనే పనులు చేపడతామని ఆయన వివరించారు. ప్రజలను అన్ని మౌలిక వసతులు కల్పించడం తన ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి దశలోకి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. ఓయూ కాలనీలో ఇప్పటి వరకు అన్ని వసతులు కల్పించామని, ఇంకా ఏమైనా ఉంటే తీసుకురండన్నారు. వెంటనే పనులు ప్రారంభించి ఇచ్చిన గడువులోగా పూర్తిచేసేలా అధికారులు చూసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

హైదర్‌నగర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన శ్రీ అలివేలుమంగా పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి 34వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానికులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, దేవినేని ప్రసాద్, నాని, సంజీవరెడ్డి చంద్రకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో ఎర్లీబర్డ్ పన్ను వసూళ్ల టార్గెట్ రూ.161 కోట్లు

గచ్చిబౌలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం 2025-2026 ఎర్లీ బర్డ్ పథకం కింద ఈనెల 30 తేదీ వరకు మొత్తం రూ.161 కోట్లు వసూలు చేయాలని కమిషనర్ ఇలంబర్తీ ఆదేశించారు. ఈ మేరకు గత నాలుగు రోజులుగా సుమారు రూ.5.65 కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు చేసినట్లు ఉప కమిషనర్ ప్రణీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను మొత్తం ఒకేసారి చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తామని, ప్రజలు ముందుగా పన్నులు చెల్లించి రాయితీని పొందాలని పిలుపునిచ్చారు. ఈ అవకాశం ఈనెల 30వ తేదీలోపు చెల్లింపుదారులకే వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల 5, 6, తేదీల్లో కూడా సర్కిల్ కార్యాలయం పౌర సేవా కేంద్రంలో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆస్తిపన్ను చెల్లించాలనుకునేవారు చెల్లించవచ్చన్నారు. రాబోయే 30 రోజుల పాటు విస్తృతంగా ప్రచారం చేసి ఎర్లీ బర్డ్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్తామని తెలిపారు.

బీసీ సర్వే సిబ్బందికి డబ్బులు ఇచ్చాం

రాష్ట్ర వ్యాపితంగా జరిగిన బీసీ కుల గణన సర్వేలో భాగంగా శేరిలింగంపల్లి సర్కిల్‌లో పాల్గొన్న ప్రైవేటు ఎన్యుమరేటర్లందరికి డబ్బులు ఇచ్చామని ఉప కమిషనర్ ప్రణీత తెలిపారు.

సర్వేలో మొత్తం 870 మంది పాల్గొన్నారని వారిలో సుమారు 50 మందికి రాలేదని తన దృష్టికి వచ్చిందన్నారు. రానివారందరికి డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

చిన్నపాటి వానకే చిత్తడి.. చిత్తడి


పాపిరెడ్డి కాలనీ నుంచి జోనల్ కార్యాలయానికి వెళ్లే దారిలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


చందానగర్ గంగారంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

చందానగర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రోడ్ల వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్లపై అడుగులోతు వరకు నీరు నిలుస్తున్నాయి. గురువారం కురిసిన వర్షానికి పలు కాలనీల్లోని రహదారుల్లో నీరు నిల్వ ఉండడంతో ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు కార్యాలయాలకు వెళ్లే వారు కూడా అవస్థలు పడ్డారు. రోడ్ల నిర్మాణాలు జరుగుతున్న సమయంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పలుసార్లు పరిశీలిస్తున్నారు. రోడ్డు లెవల్ సరిగా ఉందా లేదా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తేనే గాని తెలియదు. జీహెచ్‌ఎంసీ గ్రేటర్ కమిషనర్ గురువారం కురిసిన వర్షంతో రోడ్లపై ఎక్కడ నీరు నిలుస్తుందో పరిశీలించాలని జోనల్ కమిషనర్లకు సూచించారు. రాబోయే వర్షాకాలంలో రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండకుండా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రోడ్లు నిర్మాణం చేసేటప్పుడు రోడ్డు లెవల్ సరిగా ఉందా లేదా అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి. లేకుంటే ఇక్కట్లు పడాల్సిందే.

శ్రీ సీతారాముల కల్యాణానికి ముస్తాబవుతున్న రామాలయాలు

- కొబ్బరి పందిళ్లు..పచ్చని తోరణాలు..రంగు రంగుల పుష్పాలతో కల్యాణ వేదికలు
- ఆలయాల్లో కల్యాణ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు


సీతారామ మూలవిగ్రహాలకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు


వేమనరెడ్డి కాలనీలో ముస్తాబవుతున్న రామాలయం

భెల్‌కాలనీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దశరథ రాముని కల్యాణ మహోత్సవం కోసం రామాలయాలు, వైష్ణవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. భెల్ టౌన్ షిప్‌లో శ్రీవేంకటేశ్వర, యోగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం జరగనున్న శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లను పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణమంతా పందిళ్లు, పచ్చని తోరణాలు, రంగురంగుల పులమాలలతో అలంకరించారు. జిల్లాలోనే ప్రముఖ్యత సంతరించుకున్న బీహెచ్‌ఈఎల్ దేవాలయాల ప్రాంగణంలో జరిగే కల్యాణ మహోత్సవానికి దాదాపు 25వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేసిన దేవస్థాన కమిటీ సభ్యులు అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లను చేస్తున్నారు. దశావతార మండపంలో ఆదివారం విశేష అభిషేకాలు, అర్చనలు అనంతరం సీతారాముల కల్యాణం జరుగుతుంది.

ఎంఐజీకాలనీ శ్రీరామాలయంలో...

భెల్ ఎంఐజీ కాలనీలోగల శ్రీ రామాలయంలో ఆలయాన్ని ముస్తాబు చేశారు. దాతల సహకారంతో ఆలయం ఎదురుగా గల మైదానంలో అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు.

శేరిలింగంపల్లిలో..

చందానగర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ఆలయాల కమిటీలు వేడుకలకు సన్నద్ధం చేస్తున్నారు. చందానగర్ వేమన రెడ్డి కాలనీలోని రామాలయం, వేముకుంట వేణుగోపాల స్వామి ఆలయం. హుడాకాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయం, ఆర్టీసీ కాలనీ, మియాపూర్, మాదాపూర్, శేరిలింగంపల్లితో పాటు పలు కాలనీల్లోని రామాలయాలను ముస్తాబు చేస్తున్నారు. పలు కాలనీలు, అపార్టుమెంట్లలో కూడా వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

సాయిదత్త గణపతి ఆలయంలో...

రాయదుర్గం, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి టెలికామ్ నగర్‌లోని శ్రీ సాయిదత్తా గణపతి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలలో పాల్గొనే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త ధర్మగారి రవీందర్ రెడ్డి తెలిపారు.

మంజీరకు లీకేజీలు.. నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం రాత్రి నుంచి నీటి సరఫరాలో అంతరాయం తలెత్తింది. హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లయ్ పథకం ఫేజ్-2లో భాగంగా పటాన్‌చెరు నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు ఆర్‌సీపురం, ఫాదర్‌స్కూల్, ఓల్డ్ ముంబయ్ రోడ్డులో రెండు లీకేజీలు ఏర్పడడంతో నీరంతా వృథాగా పోతోంది. దీంతో శుక్రవారం రాత్రి 11గంటలకు పనులు ప్రారంభమవుతాయని అధికారులు ప్రకటించారు. నీటి సరఫరా నిలిపివేయడంతో పలు ప్రాంతాలకు ఎర్రగడ్డ, ఎస్‌ఆర్‌నగర్, అమీర్ పేట్, కేపీహెచ్‌బీకాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట్, జగద్గిరిగుట్ట, ఆర్సీపురం, అశోక్ నగర్, జ్యోతీ నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, దీప్తిశ్రీ నగర్, బీరంగూడ, అమీన్ పూర్, నిజాంపేట్‌లతో పాటు పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో వారం రోజుల పాటు ఇబ్బందులు తలెత్తనున్నాయి.

వృద్ధుడి అదృశ్యం


ఏడుకొండలు

చందానగర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): దుకాణంలో సిగరెట్ తీసుకువస్తానని వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కాకినాడ జిల్లా పెద్దపూడి మండలం గండిరేడు గ్రామానికి చెందిన రాయుడు ఏడుకొండలు (60). చందానగర్ డిఫెన్స్ కాలనీ లక్ష్మీ రెసిడెన్సీలో నివాసం ఉండే ఆయన కుమారుడు రాయుడు సత్యం ఇంటికి 7రోజుల క్రితం వచ్చాడు. ఈ నెల 2వ తేదీన సాయంత్రం 9.30 గంటలకు సమీపంలోని దుకాణంలో సిగరెట్ తీసుకువస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా ఆచూకీ లభిస్తే 8712566921 ఫోన్‌కు సంప్రదించాలని తెలిపారు.


సమావేశంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ, కనెక్ట్ సెంటర్ ఇన్‌చార్జీ దుర్గం భాస్కర్, తదితర నాయకులు

జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ప్రచారం ప్రారంభం

మియాపూర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు ప్రజలు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి దేశ వ్యాప్తంగా జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ప్రచారం ప్రారంభించినట్లు టీపీసీసీ జనరల్ సెక్రటరీ, కనెక్ట్ సెంటర్ ఇన్‌చార్జీ దుర్గం భాస్కర్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు శుక్రవారం మియాపూర్ మదీనగూడలో శేరిలింగంపల్లి, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కిన్నెరగ్రాండ్ హోటల్‌లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కోఆర్డినేటర్ పులి అనిల్‌కుమార్, టీపీసీసీ కోఆర్డినేటర్ చైర్మన్ గుత్తా అమిత్, శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్, చేవెళ్ల ఇన్‌చార్జీ భీమ్‌భరత్‌తో కలిసి దుర్గం భాస్కర్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, పూజిత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శోభాయాత్ర ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న శ్రీరామభక్త హనుమాన్ హిందూ రాష్ట్ర సమితి అధ్యక్షుడు పెండ్యాల నాగరాజు

శోభాయాత్ర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

హైదర్‌నగర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించబోతున్న శోభాయాత్రకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శుక్రవారం శ్రీరామభక్త హనుమాన్ హిందూ రాష్ట్ర సమితి అధ్యక్షుడు పెండ్యాల నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 4గంటలకు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమౌతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రాము, వెంకటస్వామిరెడ్డి, అభిషేక్, నవీన్, సతీష్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

'హెచ్‌సీయూ' వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ఆర్‌ఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఓబులేసు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూలో 400 ఎకరాల భూముల వేలం నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం (ఆర్‌ఎస్‌ఎఫ్) జాతీయ అధ్యక్షుడు ఓబులేసు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిలువ నీడ కోసం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలపై కొన్నేళ్లుగా నిర్బంధాన్ని ప్రయోగిస్తూ ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు భూములను అమ్మి ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఒడిగడితే ప్రజల ఆస్తులకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో కూడా యూనివర్సిటీల భూములను విక్రయించేందుకు యత్నిస్తే విద్యార్థులందరూ ఐక్యంగా ఉద్యమించడంతో వెనక్కి తగ్గారని చెప్పారు. హెచ్‌సీయూలో భూముల వేలాన్ని తక్షణమే నిలిపి వేయాలని, లేకుంటే కేసీఆర్‌కి పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థులను, ప్రజా సంఘాల నాయకులను తక్షణమే విడుదల చేయాలని, వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పండుగలే జీవనాధారం

● సీజనల్ వారీగా విక్రయంతోనే ఉపాధి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఊరిలో భూములున్నా కాలం కలిసిరాకపోవడంతో పొట్టకూటికి నగరాల వైపు మొగ్గుచూపుతున్న వారు కొందరు. వ్యవసాయం లేక ఉపాధి కోసం హైదరాబాద్‌కు తరలివస్తున్నవారు మరికొందరు. అయితే ఇక్కడికి వచ్చిన తర్వాత చదువుకున్న దానికి ఉద్యోగాలు లభించినా పోషణ భారమై బతుకుబండిని లాగలేకపోతున్నారు. ఇలాంటి వారెందరో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో పలు ప్రాంతాల నుంచి వలస వచ్చినవారు సీజనల్ వారీగా చిరు వ్యాపారాలను చేయడం ప్రారంభిస్తున్నారు. వీరంతా వినాయక చవితి, శ్రీరామనవమి, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, శ్రీకృష్ణాష్టమి తదితర పండుగలను ఎంచుకుంటారు. వినాయకచవితి సమయంలో వినాయక మట్టి విగ్రహాలను తయారు చేసి విక్రయించగా వచ్చిన సొమ్ముతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 6న జరుగనున్న శ్రీరామనవమికి సీతారాములు, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలను తయారు చేసి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. నెల రోజులుగా విగ్రహాలను తయారు చేసిన ఈ కుటుంబాలు ప్రస్తుతం హెచ్ఎంటీ రోడ్డులోని ఫుట్‌పాత్‌పై విగ్రహాలను పెట్టి విక్రయాలు చేపట్టారు. వీరు ఒక ఫీటు నుంచి మూడు ఫీట్ల విగ్రహాలను తయారు విక్రయాలు చేస్తున్నారు. మూడు ఫీట్ల ఎత్తు విగ్రహాలను రూ.4000 వేలకు చెప్పి రూ.3500లకు, రెండు ఫీట్లవి రూ.2500 చెప్పి 2 వేలకు, ఒక ఫీటు ఎత్తు వాటిని రూ.1500లు చెప్పి రూ.1000లకు విక్రయిస్తున్నారు. రోజంతా ఈ పనిలో ఉంటే రూ.1000 నుంచి రూ.1500 వస్తాయని, వాటితోనే కుటుంబం పొట్ట నింపుకుంటుందని తెలుపుతున్నారు.



సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలు



శ్రీకృష్ణుడి విగ్రహం



విక్రయానికి దేవతామూర్తుల విగ్రహాలు

20 ఏళ్లుగా..



గుజరాత్ నుంచి 20 సంవత్సరాల క్రితం ఇక్కడికి వచ్చి విగ్రహాలను తయారుచేయడం ప్రారంభించాను. ప్రస్తుతం నాకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఇద్దరు పిల్లలను ఇక్కడికి తీసుకొద్దామంటే వచ్చే డబ్బులు సరిపోక గుజరాత్‌లోనే బంధువుల వద్ద ఉంచి చదివిస్తున్నాను. మట్టితో పాటు వైట్ సిమెంట్‌తో విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నాం. రోజుకు రూ.1000లు వరకు లభిస్తుంది. పండుగల సీజనే మాకు జీవనాధారం. సంవత్సరంలో వచ్చే నాలుగైదు పండుగల సమయంలో చేసే మా చిరువ్యాపారం సంవత్సరమంతా ఖర్చు చేస్తాం. మిగతా సమయంలో అలంకరణ, దేవతామూర్తుల విగ్రహాలను విక్రయిస్తూ ఉపాధిని పొందుతున్నాం. పర్వాలేదు.

- తేజారామ్, విగ్రహాల విక్రేత

రోజుకు రూ.800 వరకు సంపాదిస్తా

ఊరిలో పని లభించక ఇక్కడికి వచ్చి అలంకరణ బొమ్మలతో పాటు దేవతామూర్తుల విగ్రహాలను తయారు చేయడం ప్రారంభించాం. విక్రయించగా వచ్చే సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. రోజుకు రూ.800 వరకు సంపాదిస్తాను. ఇక్కడికి వచ్చి చేస్తున్న చిరు వ్యాపారం ఫర్వాలేదనిపిస్తుంది.

- ఆనంద్, చిరు వ్యాపారి



హైడ్రా కూల్చివేతలతో రోడ్డెక్కిన బాధితులు

హైడ్రా కూల్చివేతలు

షాపూర్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సూరారంలోని ఓ ఇంటి ప్రహరీని ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఉదయం 7 గంటల ప్రాంతంలో కూల్చివేసిన హైడ్రా అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు. సర్వే నంబర్ 16/28లోని ప్రైవేట్ భూమిని ప్రభుత్వ భూమి అంటూ 2009లో నిర్మించిన ప్రహరీ కూల్చివేయడం ఏమిటని అధికారులను ప్రశ్నిస్తున్నారు. వారాల రాజేశ్వరావు పేరుపై ఉన్న భూమిని ప్రభుత్వ భూమిగా చూపిస్తూ అందులో నిర్మించిన గోడను కూల్చివేశారని, ఎందుకు కూల్చివేస్తున్నారని అడిగితే పోలీస్‌స్టేషన్‌కు తరలించారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవగాహన లేకుండా హైడ్రా అధికారులు కూల్చివేయడం సమంజసం కాదని అన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై కోర్టుకు వెళతామని సదరు యజమాని ఆరోపిస్తున్నారు.



రహదారిపై నిలిచిన వర్షపునీరు

పూడుకుపోయిన నాలాలు.. రోడ్డుపైనే వర్షపు నీరు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని రహదారిలో నిలిచిపోయిన వర్షపునీరు వల్ల రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. నాలాలు పూడుకుపోవడంతో ఎప్పుడు వర్షాలు కురిసినా రంగారెడ్డినగర్ శివాజీ విగ్రహం సమీపంలోని రహదారిలో వర్షపునీరు నిలిచిపోతుంది. ఈ రహదారి పక్కనే ఉన్న నాలాలు పూడుకుపోవడం వల్ల సమస్య జఠిలంగా మారుతుందన్న సంగతి అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదు. వర్షం కురిసినప్పుడల్లా నీరు నిలుస్తుండడం, ఆ ప్రాంతాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడమే తప్ప శాశ్వత పరిష్కారం చూపడంలేదని స్థానికులు వారిపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వరద నివారణకు సమగ్ర చర్యలు తీసుకోండి

● అధికారులను ఆదేశించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిది

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలో కురిసిన వర్షాలకు హకీంపేట్ వరద ప్రవాహం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా శాశ్వత పరిష్కారం చేసేందుకు పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిది అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఎస్.ఈ రత్నాకర్, అధికారులతో కలిసి వరద ముంపునకు గురైన ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, లోటస్ పాండ్ నుంచి వరద ప్రవాహం హకీంపేట నుంచి బల్కం చెరువులోకి వెళుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. గతంలో వరద రాలేదని హెచ్ఎండీఏ లేఔట్ చేయడం మూలంగా వర్షం కురిసినప్పుడు వరద వస్తునట్లు స్థానికులు తెలిపారు. గతంలో లేఅవుట్ చేయకముందు ఎక్కువ వరద రాలేదని, ఇటీవల కురిసిన వర్షాలకు హకీంపేట్‌కు మట్టితో వరద వస్తుందని తెలిపారు. వరదలో వచ్చిన మట్టిని వెంటనే తొలగించాలని ఆదేశించారు.

ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి డీపీఆర్ తయారు చేసి పంపాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఎస్.ఈ రత్నాకర్, కార్వాన్, జూబ్లీహిల్స్ ఈఈలు వెంకట శేషాచలం, విజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు వినతి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వర కాలనీకి వెళ్ళే చెరువు కట్టపై విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఏఈ శ్రీనివాస్‌కు స్థానికులు, నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ప్రాంతంలో విద్యుత్ లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల బైక్‌పై వస్తున్న ఇద్దరు చెరువులో పడి మృత్యువాత పడ్డారని, చెరువుకట్టపై విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని మున్సిపల్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు బి.ప్రశాంత్‌గౌడ్ అన్నారు. వినతిప్రతం అందజేసిన వారిలో ఆంజనేయులు, నవీన్ ముదిరాజ్, యోగి, వెంకటయ్య, వరుణ్‌రాజ్, భాస్కర్, సాయిలు పాల్గొన్నారు.



సబ్-రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు చేపట్టాలి

దుండిగల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోవాలని సూరారం సబ్-రిజిస్ట్రార్‌కు బీజేపీ నాయకులు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సూరారం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అవినీతి, మోసాలపై తీవ్ర ఆరోపణలు ఉన్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని బీజేపీ నాయకులు ఆకుల సతీష్ తెలిపారు. భాగ్యలక్ష్మి కాలనీ, ప్లాట్ నం.215లో మూడు వందల గజాల స్థలానికి సంబంధించిన పత్రాల్లో డాక్యుమెంట్ నంబరు 4062/2023 అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కమ్ పత్రాలపై అనుమానంగా ఉందని, దీనిలో ఆధార్, పాన్‌కార్డులను తప్పుగా మార్చారని తెలిపారు. ఆ డాక్యుమెంట్లను రద్దు చేయాలన్నారు. దీనిపై కోర్టు విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లా జయశంకర్‌గౌడ్, అరుణ్‌రావు, చందూ, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



బస్తీల్లో పాదయాత్ర చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

● మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, రాజకీయ మనుగడ కోసం బీజేపీ విద్వేషాలను రెచ్చగొడుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు జైబాపు జైబీమ్ జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలను చేతబట్టి బస్తీలలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బీజేపీ మహాత్మాగాంధీ వారసత్వాన్ని, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గణేష్, కృష్ణగౌడ్, రషీద్, ఐలయ్య గౌడ్, గూడ వరమ్మ, స్వాతి, నరేష్ గౌడ్, నరేందర్‌రెడ్డి, రవికుమార్, తిరుమలరెడ్డి, జనార్ధన్, కౌసల్య, చంద్రకళ, అనిత, సాయిప్రవీణ్ పాల్గొన్నారు.

మంజీరకు లీకేజీలు..
నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం రాత్రి నుంచి నీటి సరఫరాలో అంతరాయం తలెత్తింది. హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లయ్ పథకం ఫేజ్-2లో భాగంగా పటాన్‌చెరు నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు ఆర్‌సీపురం, ఫాదర్‌స్కూల్, ఓల్డ్ ముంబయ్ రోడ్డులో రెండు లీకేజీలు ఏర్పడడంతో నీరంతా వృథాగా పోతోంది. దీంతో శుక్రవారం రాత్రి 11గంటలకు పనులు ప్రారంభమవుతాయని అధికారులు ప్రకటించారు. నీటి సరఫరా నిలిపివేయడంతో పలు ప్రాంతాలకు ఎర్రగడ్డ, ఎస్ఆర్ నగర్, అమీర్ పేట్, కేపీహెచ్‌బీకాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట్, జగద్గిరిగుట్ట, ఆర్సీపురం, అశోక్ నగర్, జ్యోతీ నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, దీప్తిశ్రీ నగర్, బీరంగూడ, అమీన్ పూర్, నిజాంపేట్‌లతో పాటు పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో వారం రోజుల పాటు ఇబ్బందులు తలెత్తనున్నాయి.



రెవెన్యూ అధికారులు కూల్చివేసిన కాంపౌండ్ వాల్

అక్రమ నిర్మాణం కూల్చివేత

జీడిమెట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్టలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన కాంపౌండ్‌ను మండల రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. సర్వే నంబర్ 348/1లో గల అనాధాశ్రమం స్థలం సమీపంలో ఓ కబ్జాదారుడు రాత్రికి రాత్రే గది నిర్మించి కాంపౌండ్ వాల్ నిర్మించాడు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీమ్‌కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని ఆర్ఐ హెచ్చరించారు.



డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ మండలంలో ప్రభుత్వ సర్వే నంబరు 79, 219లో కబ్జాదారులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ విషయమై బీజేపీ నాయకులు కుత్బుల్లాపూర్ మండల డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జునరావుకు శుక్రవారం మండల కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి, తప్పుడు పత్రాలు సృష్టించి, భూములను ఆక్రమించుకుంటున్నారని డీటీకి తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని, గతంలో డీఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించిన సర్వే నంబరు 79, 219ల్లో కబ్జాకు గురైందని నివేదిక ఉన్నా అధికారులు వారిపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్, శంకర్, అరుణ్ పాల్గొన్నారు.



ఫ్లెక్సీని పట్టుకొని పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

నిజాంపేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణ కోసం చేపట్టిన జై భీమ్ జైబాపు జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 3, 4, 5వ డివిజన్లలో నిర్వహించారు. దీనిని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆదేశాలతో ఎన్ఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులతో కలిసి పాదయత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానిస్తూ, అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ప్రతిఒక్కరూ కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలిపేవిధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సునీల్‌రెడ్డి, ఇంద్రారాజిత్, కొలన్ వీరేందర్‌రెడ్డి, చిట్ల దివాకర్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జీడిమెట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్వీన్‌కాలనీ ఫేజ్-2లో నగునూరి శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఇతడి వద్ద చింతల లింగస్వామి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 6 గంటలకు వాచ్‌మన్ నిర్మాణంలో ఉన్న ఇంటి వద్దకు రాగా దాదాపు 35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ఇంటి ముందు మృతి చెంది ఉన్నాడు. జగద్గిరిగుట్ట పోలీసులకు ఇంటి యజమాని సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరకుని సీసీ కెమెరాలను పరిశీలించగా మృతుడు అర్ధరాత్రి వేళ ఇనుపరాడ్లు, సెంట్రింగ్ బాక్స్‌ల దొంగతనానికి వచ్చి ప్రమాదవశాత్తు మద్యం మత్తులో కిందపడి మృతి చెందినట్టు నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీరామనవమికి ఏర్పాట్లు

ఈ నెల 6న శ్రీరామనవమి కల్యాణ మహోత్సవంలో భాగంగా నిజాంపేట్ హరిత వనం కాలనీలో కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో పందిరిరాట ఏర్పాట్లు చేశారు. అనంతరం మహిళలతో కలిసి పసుపు కొట్టారు.

- నిజాంపేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి)



బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ

ఎర్రవెల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగిన పార్టీ రజతోత్సవ మహాసభలో పార్టీ హైదరాబాద్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు అధ్యక్షుడు కేసీఆర్‌తో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు.

- నిజాంపేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి)

అడుగేయలేని.. అంతర్గత రహదారులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం కురిసిన వర్షానికి అంతర్గత రహదారులు దయనీయంగా మారాయి. డివిజన్ పరిధిలోని వాజ్‌పాయినగర్, శివారెడ్డినగర్, శ్రీనివాసనగర్, సంజీవయ్యనగర్‌లలో ప్రజల పరిస్థితి అడుగు తీసి అడుగు వేయలేని విధంగా మారిందంటే ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాజ్‌పాయినగర్, సంజీవయ్యనగర్ సరిహద్దు రోడ్డు వద్ద వరద నీరంతా నిలిచి చిన్నపాటి కుంటను తలపిస్తోంది. తాగునీటి పైప్‌లైన్లు వేసి ప్యాచ్ పనులు చేయకపోవడంతో అధ్వానంగా మారింది. వాజ్‌పాయినగర్ నుంచి మెహర్ సాయి స్కూల్ దారిలో నాణ్యత లేకుండా మ్యాన్‌హోళ్లు నిర్మించడంతో అవి శిథిలమయ్యాయి. వరదనీరు వచ్చిన సమయంలో అందులో ఎవరైనా పడిపోతారనే భయంతో స్థానికులు కట్టెను పాతి హెచ్చరిక బోర్డుగా ఏర్పాటు చేసుకున్నారు. శివారెడ్డినగర్ సంక్షేమ సంఘం కార్యాలయం సమీపంలో నీరంతా నిలిచి దుర్గంధ పూరితంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీ వాసులు అధికారులు, పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



శివారెడ్డినగర్‌లో రోడ్డుపై నిలిచిన వరద నీరు



శిథిలమైన మ్యాన్‌హోల్‌లో కట్టెను పాతిన దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సురేష్‌కుమార్

శ్రీరామనవమిని ప్రశాంతంగా జరుపుకోవాలి

నిజాంపేట్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ ఐపీఎస్ కోరారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తులకు అవగాహన కార్యక్రమానికి డీసీపీ ముఖ్యఅతిథిగా హాజరై సలహాలు సూచనలు చేశారు. శబ్ద కాలుష్యం లేకుండా, సమయపాలన పాటించడం, భక్తులు ఆలయాల వద్ద క్యూలైన్‌లో వచ్చేవిధంగా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, బాచుపల్లి సీఐ ఉపేందర్, ఎస్ఐ హరీష్, ఇతర అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.